క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు సూచించారు. నగరంలోని చుట్టుగుంటలోని పోలేరమ్మ తల్లి గుడి కొలుపుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, వీరిశెట్టి సుబ్బారావు, పటాన్ సైదా ఖాన్, కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, పార్టీ నేతలు అంగడి శ్రీనివాసరావు, నాగ గౌడ్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



గుంటూరు ఎడ్యుకేషన్: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు రూరల్ రెడ్డిపాలెంలోని మానవతా సేవా సమితిలోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో చిరు అభిమానులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిరు అభిమానులు ఎం.శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, గిడుతూరి సత్యం, ఏ.శంకర్‌రెడ్డి, శరత్, ఆళ్ల హరి, అడపా శ్రీను, చిమటా శ్రీనివాస్, కందబాబు, ఎం. రమేష్, సూరిబాబు, సాగర్ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై ఆదివారం నెలవారీ కార్యక్రమంలో భాగంగా కొల్‌కత్తా పద్మావతి సారనాథన్ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆమె ఆలపించిన కీర్తనలు అలరించాయి. వయోలిన్‌పై గాయత్రీ శివాని, మృదంగంపై ఆర్.అనంతకృష్ణన్(చెన్నై) వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో కొలుపుల మహోత్సవం



గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసియున్న ఆళ్ళవారి శ్రీ తినంకమ్మ తల్లి కొలుపుల మహోత్సవం రెండవరోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారు ఝామున దేవర ఇంటినుంచి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అమ్మవారికి మహా పొంగలి కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి తీర్థ ప్రసాదం అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: పట్టణంలోని సివిల్ జూనియర్ కోర్టులో సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడే అన్ని కేసులకు అదాలత్‌లో పరిష్కారం లభించి కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తెనాలి: రూరల్ మండలం పెదరావూరు గ్రామంలోని శ్రీగంగా భ్రమరాంబ సహిత శ్రీమల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో పెదరావూరుకు చెందిన పాటిబండ్ల కోటేశ్వరరావు, రవిచంద్రిక దంపతుల సహకారంతో ఈ ప్రతిష్ఠను చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.శ్యామ్‌సుందర బాబు, ఆలయ ప్రధాన పూజారి చావలి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

క్రిమినల్స్‌కు బస్టాండ్

- గంజాయి.. బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డా
- మొద్దు నిద్రపోతున్న అవుట్ పోస్ట్ సిబ్బంది
- ఇటీవల విద్యార్థిని బెదిరించి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిన దుండగులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

'షేక్ షమ్మీది విజయవాడ. సత్తెనపల్లి వద్ద కంటెపూడిలో ఓ కళాశాలలో ఫార్మా డి చదువుతోంది. ఇంటికి వెళ్లేందుకు గుంటూరు బస్టాండ్‌కు వచ్చింది. విజయవాడ బస్సు కోసం ఎదురు చూస్తోంది. ఓ యువకుడి వచ్చాడు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్నాడు. బెదిరించాడు. చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యాడు. స్టేషన్‌కు వెళ్తే పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. ఇదీ ఇటీవల చోటుచేసుకుంది.' ఇలాంటి ఘటనలు తరుచూ ఆందోళన కలిగిస్తున్నాయి.

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో అవుట్‌పోస్టు అలంకారప్రాయంగా మారింది. అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నా చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. మహిళలు, విద్యార్థినులు ఫిర్యాదు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ పరిసర ప్రాంతాలే టార్గెట్..

ఆర్టీసీ పరిసర ప్రాంతాలే అడ్డాగా చేసుకుని బ్లేడ్ బ్యాచ్ యథేచ్ఛగా తిరుగుతోంది. ఈ క్రమంలో కాలచక్ర బార్ అండ్ రెస్టారెంట్, అరవై అడుగుల రోడ్డులోని అనేక లాడ్జిల వద్ద కొంత మంది మహిళలు నిలబడి, గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రులు, ఇతర పనుల మీద వచ్చే వారిని తీసుకుని వెళ్లి, దాడులు చేయించి వారి వద్ద ఉన్న డబ్బులు, వస్తువులు లాక్కుని వెళ్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పరువు పోతుందనే క్రమంలో కొంత మంది కనీసం పోలీసులను కూడా ఆశ్రయించని పరిస్థితి. బ్లేడ్ బ్యాచ్ అధికంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువకులు ఒక గ్రూపుగా ఏర్పడి.. ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ఒక బార్ వద్ద, బస్టాండ్ ఎదురుగా వైన్స్‌ల వద్ద కాపలా కాస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని గుర్తించి.. నిర్మానుష ప్రదేశంలోకి తీసుకుని వెళ్ళి భయపెట్టి డబ్బులు గుంజుకుంటున్నారని తెలుస్తోంది. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో వీరికి అడ్డాలు. గతంలో ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించిన సమయంలో కొంత మంది బ్లేడ్ బ్యాచ్ దొరికిపోయారు.



ఖాళీగా ఉన్న ఆర్టీసీ అవుట్ పోస్టు

లాడ్జిల నుంచి భారీగా వసూళ్లు...?

ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ముఖ్యంగా లాడ్జిల వద్ద జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల కారణంగానే బ్లేడ్ బ్యాచ్ వికృత చేష్టలు పెరిగిపోతున్నాయి. సదరు మహిళలతో వారికి సాన్నిహిత్య సంబంధాలు ఉండటం, వారు ఫోన్ చేయగానే సంబంధిత వ్యక్తులను భయపెట్టి డబ్బులు, సెల్‌ఫోన్‌లు లాక్కుని పరారీ అవుతున్నాయనేది బహిరంగ రహస్యం. ఈ క్రమంలో లాడ్జిల నుంచి పోలీసుల స్టేషన్‌లకు నెలవారీ మామూళ్ళు పెద్ద ఎత్తున ఇస్తున్నారని తెలుస్తోంది. పేకాట, వ్యభిచారం జరుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా కాసుల కోసం కక్కుర్తి పడి వదిలేస్తున్నారని తెలుస్తోంది.

గతంలో చోటుచేసుకున్న ఘటనలు....

- కొద్ది రోజుల క్రితమే విజయవాడ బస్టాప్ సమీపంలో ఒక మహిళను నలుగురు యువకులు వెంటబడిన ఘటనపై కేసు నమోదైంది.
- గతంలో అర్ధరాత్రి దూర ప్రాంతం నుంచి బస్సులో దిగి బయటకు వచ్చిన ప్రయాణికుడు.. ఆటో కోసం ఎదురు చూస్తుండగా ముగ్గురు గుర్తు తెలియని యువకులు.. పూటుగా మద్యం.. గంజాయి తాగి.. ఆ ప్రయాణికుడిని భయపెట్టి తన వద్ద ఉన్న రూ.2,800 లాక్కుని అక్కడ నుండి పారిపోయారు.
- ఒక వ్యభిచారిణి ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన ఒక వ్యక్తిని. కొంత మంది వ్యక్తులతో కలిసి మాయ చేసి కాకాని రోడ్డులోని తీసుకుని అతడిని కొట్టి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిన ఘటన చోటుచేసుకుంది.
- ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక వృద్ధుడిని బ్లేడ్ బ్యాచ్ గొంతు కోసం.. అతని వద్ద డబ్బులు లాక్కుని వెళ్లిపోయిన ఘటన గుంటూరులో ఒకప్పుడు కలకలం రేపింది.

చర్యలు తీసుకుంటాం



అవుట్‌పోస్టులో సిబ్బంది బందోబస్తు అధికంగా ఉన్న క్రమంలో ఉండని పరిస్థితులు ఉన్నాయి. మిగతా సమయాల్లో లేకుండా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. దీనితో పాటుగా విజయవాడ బస్టాండ్ సెక్టార్‌లో లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించాం. ఆర్టీసీ అవుట్‌పోస్ట్ సిబ్బందితో పాటు, పాత గుంటూరు అధికారులకు కూడా సూచనలు చేస్తాం.

– షేక్ అబ్దుల్ అజీజ్, డీఎస్పీ, గుంటూరు ఈస్ట్

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు ఉంటుందని చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ



నగరంపాలెం: వృద్ధులకు అవసరమైన నిత్యావసరాలను అందిస్తున్నట్లు గిరిధారి మిత్రమండలి అధ్యక్షులు బవిరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. నెలనెలా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తపేట సోమువారివీధిలోని సమితి కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్‌లను అందించారు. కార్యక్రమంలో దాతలు సకల వెంకటనాగేంద్రకుమార్, వెంకటశివప్రియజ్యోతి, సమితి కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్ పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో పేదలకు పెన్షన్, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ అందజేయడం అభినందనీయమని అన్నారు. పెన్షన్‌తో పాటు రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసరాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం మంచి పరిణామమని చెప్పారు. అవోపా నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. అనంతరం వృద్ధులకు ఆరోగ్య పరిరక్షణ కోసం పలు సూచనలు అందించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో అవోపా ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, పేదలకు ఆదుకోవడంతో పాటు వారి ఉన్నతికి వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అవోపా శాఖల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అంశాల్లో రాష్ట్రస్థాయిలో వివిధ పథకాలు చేపడుతున్నామని, వచ్చే నెలలో పేద విద్యార్థులకు రూ.40 లక్షలు ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, ఊటుకూరు నాగేశ్వరరావు, కోటిస్వామి గుప్తా, వెంకట్రావు, మద్ది కోటిరత్నం పాల్గొన్నారు.



పేదలకు పెన్షన్ అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, తటవర్తి రాంబాబు, కేవీ బ్రహ్మం

30న సంచార, విముక్త జాతుల మహాసభ

గుంటూరు మెడికల్: విజయవాడలో ఈనెల 30న సంచార, విముక్త జాతుల మహాసభ నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తుళ్లిమిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంచార సమాజంలో వివిధ సంచార సంఘాలు, మేధావులు నాయకులు కుల పెద్దలు యువత మహిళలు అందరు 'స్ఫూర్తి' కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ సంచార సమాజం ఆత్మగౌరవం, చరిత్ర, త్యాగం పోరాటపటిమ, ఎదుర్కొంటున్న సమస్యలు సమాజానికి, ప్రభుత్వాలకు, అధికారులకు తెలిసే విధంగా ఒక పెద్ద పండుగలా విజయవాడలో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ, కార్యదర్శి నారాయణరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే శేషగిరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దారా అంబేడ్కర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు రమాదేవి, నాయకులు బండారుపల్లి రోశయ్య, పడమట రాధాకృష్ణ పాల్గొన్నారు.



స్ఫూర్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

వైభవంగా పోలేరమ్మ అమ్మవారి జాతర

నగరంపాలెం: స్థానిక కోబాల్డుపేట ఏడో వీధిలోని శ్రీపోతురాజు సహిత పోలేరమ్మ అమ్మవారం దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కొలుపులు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకార పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను దేవస్థానం నిర్వాహకులు అందజేశారు. గ్రామోత్సవం ఆయలం వద్ద మొదలై డప్పు వాయిద్యాలతో కోబాల్డుపేట మీదగా బ్రాడీపేట, దేవాపురం, కోబాల్డుపేట 8వ వీధి మీదగా దేవస్థానం వరకు వైభవంగా కొనసాగింది.



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ తల్లి



గ్రామోత్సవం

ఊపిరితిత్తుల సమస్యలపై అవగాహన ఉండాలి

పల్మనాలజిస్ట్ అనూష మోదేపల్లి

లక్ష్మీపురం: ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని ప్రముఖ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ అనూష మోదేపల్లి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దగ్గు, కఫం ఛాతి పట్టి వేయడం లాంటి లక్షణాలు కనబడితే వెంటనే పల్మనాలజిస్ట్ కలవాలన్నారు, సాధారణంగా దగ్గు సమస్య 15 రోజులకు మించి ఉంటే వెంటనే అది ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యగా భావించి పల్మనాలజిస్టును సంప్రదించాలని కోరారు. అనంతరం పల్మనాలజిస్టుగా విశేష సేవలందిస్తున్న డాక్టర్ అనూషను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. అవగాహన సీనియర్ సభ్యులు శాంత శ్రీమన్నారాయణ, గాయత్రి బ్యాంక్ మేనేజర్ టి.సుబ్బారావు, కిమ్స్ శిఖర హాస్పిటల్ పీఆర్‌ఓ నూరుల్ అహ్మద్, కుమార్ ప్రసంగించారు.



మాట్లాడుతున్న ప్రముఖ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ అనూష

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆదివారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా యర్రగొండబాలెం గ్రామానికి చెందిన వినీత, కవలకుంట్ల గ్రామంలో ఆశ వర్కర్‌గా పని చేస్తోంది. ఐదేళ్ల క్రితం చాపలమడుగు గ్రామానికి చెందిన పల్లె నెహెమియా అనే వ్యక్తితో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భర్త నెహెమియా వివాహం అయినప్పటి నుంచి చిన్న చిన్న విషయాలకు గొడవ పడుతు వేధింపులకు గురి చేస్తుంటాడు. అయితే భర్త వేధింపులతో పాటు అత్త, మామలు నిత్యం అధిక కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తుంటారు. దీంతో గత కొన్ని రోజుల క్రితం అత్తింటి నుంచి గుంటూరు అరండల్‌పేటలోని బాధితురాలు వినీత సోదరి ఇంటికి వచ్చి ఉంటు, మానసికంగా బాధపడుతూ పలు రకాల బిళ్లలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలంలో వినీత సోదరి కె.రోజలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు పంటలను కాపాడాలి

తెనాలి: దేవరపల్లి అగ్రహారం భూములకు మురుగు నీటి కాలువలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.భావనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తెనాలి రూరల్ మండలం గుడివాడకు చెందిన రైతులతో కలిసి ఆయన ముంపునకు గురైన పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు మురుగు కాలవను కోల్పోవడంతో పంట కాలువలకు వచ్చిన ముప్పును ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొలకలూరు–తెనాలి మధ్య దక్షిణ మధ్య రైల్వే మూడో రైల్వే లైన్ నిర్మాణం చేసేటప్పుడు మురుగు కాలువ తూములు ఊడిపోయాయని పేర్కొన్నారు. దీంతో 125 ఎకరాలకు పైగా అగ్రహారం భూములు మురుగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యను తెనాలి సబ్ కలెక్టర్ దష్టికి తీసుకు వెళ్లేందుకు సోమవారం తెనాలి రావాల్సిందిగా రైతులను కోరారు. రైతులు, కౌలు రైతులు తమ్మ శివరాం, నాగుబోయిన సుబ్రహ్మణ్యం, కడియాల శివరామ బ్రహ్మం, నాగుబోయిన హనుమంతరావు, శివయ్య, గోపతోటి జకరయ్య, కప్పల వెంకటేశ్వరరావు, గుంపెన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి ఉపాధ్యక్షులు లంక విజయబాబు, సామాజిక కార్యకర్త కామేపల్లి వెంకటేశ్వర్లు, హోమియో వైద్యులు ఎం.శ్రీనివాసరెడ్డి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్నారులు జగడపు చనువుల, వెంకటేశ్వర కల్యాణం, కాళింగ నర్తనం నృత్య ప్రదర్శనలు అలరించాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్థ నిర్వాహకులు ఇండ్ల శ్రీధర్‌బాబు, న్యాయవాదులు నారదాసు వీరమణి, తోట శ్రీనివాస్, ఆచార్య ఎ.రాధాకృష్ణమూర్తి, పాతూరు సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యతోనే సూర్య బలిజల అభివృద్ధి సాధ్యం

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

లక్ష్మీపురం: సూర్య బలిజలు స్వాతంత్ర్య అనంతరం కూడా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అనేక వివక్షతలకు గురవుతున్నారని, విద్యతోనే అధిగమించవచ్చని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో సూర్య బలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విద్యా సంఘం అధ్యక్షుడు చదలవాడ రఘురాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా పేద విద్యార్థులను గుర్తించి వారి విద్యాభివృద్ధికి చేయూతనందిస్తున్న సూర్య బలిజ సేవా సంఘం సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. విద్య సంఘం అధ్యక్షులు చదలవాడ రఘురాం, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ దాసరి కృష్ణారావు మాట్లాడుతూ సూర్య బలిజ సంఘం పేద విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. బీసీ పేద విద్యార్థులకు సంఘం తరఫున ఎల్లప్పుడు అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో విద్యాసంఘం కార్యదర్శి మద్దెల కైలాసనాథ్ బాబు, కోశాధికారి సిద్ధాబత్తుని విజయకుమార్, అల్లు భాస్కరరావు, మద్దుల రాము, చిత్తజల్లు నాగ రాము, మద్దుల వీరభద్రరావు, జక్కుల వెంకట రమణమూర్తి, తీగల దుర్గాప్రసాద్, జిల్లా విద్యా సంఘం నాయకులు, పూల మహేష్, చదలవాడ సుధాకర్, ధరణికోట మోహన్ రావు పాల్గొన్నారు.



స్కాలర్ షిప్ అందజేస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే, రఘురాం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు వెస్ట్(క్రీడలు): యోగాలో ప్రపంచ గుర్తింపు పొందిన భారత్‌లో ప్రతి ఒక్కరూ సాధన చేయాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని కెనడీ స్కూల్లో నిర్వహించారు. 8 నుంచి 45+ వరకు వయస్సుల వారీగా పోటీలు జరిగాయి. సుమారు 100 పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నసీర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే యోగా విశిష్టతను, అవసరాన్ని విద్యార్థులు గుర్తించేలా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. యోగాతో చక్కని మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు క్రమ శిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం విజేతలకు నసీర్‌తో పాటు కెనడీ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, చిట్టాబత్తిని శ్రీనివాసరావు అందజేశారు.



విజేతకు బంగారు పతకం అందిస్తున్న తూర్పు ఎమ్మెల్యే

జేవీఎం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

గుంటూరు మెడికల్: అత్యాధునిక వైద్యసేవలు అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జేవీఎం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్నామని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక కొత్త పేటలోని మణిపురం ఫ్లైఓవర్ పక్కన భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో నిర్మించిన జేవీఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ వైద్యులు హాజరై ప్రారంభించారు. తెనాలిలో మూడు దశాబ్దాలుగా పేద వారికి తల్లి పిల్లల ఆసుపత్రి సేవలందించి నేడు గుంటూరు ప్రజలకు సేవలందించేందుకు ముందుకొచ్చినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, మహమ్మద్ నసీర్ అహ్మద్, ఎమ్మెల్యే గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు, తులసి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర, మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పిల్లల వైద్యులు డాక్టర్ కోటి నాగయ్య, గైనకాలజిస్ట్ డాక్టర్ జేవీ లక్ష్మి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జె.పవన్‌కుమార్, జనర్ల్ సర్జన్ డాక్టర్ జె.లోకేష్ పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న తులసి రామచంద్రప్రభు